# అద్దం

ఎ.వి.రెడ్డిశాస్త్రి

చిన్న సంఘటనే— నిశ్చయంగా అది చాలా చిన్న సంఘటనే. అయినా అతగాడు నన్ను చీదరించుకున్న విధానం నా మనస్సుని బాగా గాయపర్చింది. కొద్ది క్షణాలపాటు బాధలో విలవిల్లాడిపోయాననడం సబబుగా ఉంటుంది. నన్ను చూసి అసహ్యించుకుంటూ 'నో' అని విదిల్చికొట్టిన ఆ వ్యక్తికి వెంటనే జవాబిచ్చి ఉండవలసింది ''మిస్టర్ నేనూ చదువుకొని, పెద్ద ఉద్యోగం చేసి బాగా బతికినవాణ్ణేనయ్యా— ఇప్పటి నా స్థితిలో నేన్నీకు బిచ్చగాడిలా కనిపిస్తున్నట్టున్నాను'' అని. కానీ ఎందుకనో నా గొంతు నా అదుపులో లేనట్టనిపించేసింది. అనాలని నేను ఉద్దేశించిన మాటలు నా గొంతునుండి బయటకు రాకుండా ఏదో అజ్ఞాత శక్తి ఏదో బాధాకరమైన జ్ఞాపకం ఆపేశాయి. నా దీనస్థితి గుర్తుకు రాగానే ఏదో చెప్పలేని నైరాశ్యభావం ఉస్సురని నిట్టూరుస్తూ దగ్గరగా ఉన్న ఓ కుర్చీమీద చతికిలబడ్డాను.



ఓ అయిదేళ్ళ క్రిందట సంగతి. ఇదే బ్యాంక్‌లో సరిగ్గా ఇలాంటి సంఘటనే జరిగింది. ఇప్పుడు నన్ను చీదరించుకున్న యువకుడి పాత్రలో నేనున్నానప్పుడు. నా ఆరోగ్యం, నా వయస్సు, ఉద్యోగపు హోదా, డబ్బువల్ల వచ్చే అహం— ఇవన్నీ నన్ను నేలమీద నిలబడనివ్వకుండా చేస్తుండేవి ఆ రోజుల్లో. టాటా కన్సల్టెన్సీ ఢిల్లీ బ్రాంచిలో ఉద్యోగం, ఆఫీసుకారు, మంచి క్వార్టర్స్, ఈ స్టేటస్ సింబల్స్‌తో నా దర్పానికి అంతం ఉండేదికాదు. కంపెనీ ఖర్చుమీదనే అవుగాక— నా యూరప్ పర్యటనకూడా నేను పక్కా ఇగోయిస్టుగా మారడానికి దోహదపడి ఉండవచ్చు. నేను యూనివర్శిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే నీరద్ చౌదరి పుస్తకాలవల్ల బాగా ప్రభావితుణ్ణయ్యాను. వయ్‌పాల్ (V.s.Naipal) పుస్తకం '' ద ఏరియా ఆఫ్ డార్క్‌నెస్'' నన్ను మరింతగా స్వజాతీయుల్ని అసహ్యించుకునే స్థితికి దిగజార్చింది. యూరప్ వెళ్ళి వచ్చాక అసలు, సిసలైన 'స్నాబ్'(Snob) గా తయారయ్యాను. భారతీయులన్నా, భారతీయుల అలవాట్లన్నా, భారతీయులు చేసే గావుకేకలన్నా విపరీతంగా అసహ్యించుకుని, మొత్తం భారతీయులందర్నీ అపహాస్యం చేసే స్థితికి ఎదిగింది నా సంస్కారం. వీళ్ళంతా నా దేశస్థులే, నేను కూడా వాళ్ళలో ఒక భాగమే అనే గుర్తింపు పోయింది పూర్తిగా.

యూరప్‌నుంచి తిరిగొచ్చిన కొన్నాళ్ళకి ఈ ఊరు రావలసిన అవసరం పడింది. ఇక్కడ నాకు కాస్త పొలాలు, ఒక పాత ఇల్లు ఉన్నాయి.



## రెస్పాన్స్

"మీ కంపెనీకి నైట్ గార్డ్ కావాలని అడ్వర్టయిజ్ చేసారు కదా! ఏమయినా రెస్పాన్స్ వచ్చిందా!"

"రాత్రే రెస్పాన్స్ వచ్చింది. దొంగలు పడి దోచుకెళ్లారు.

జె.మహేష్
పాముదుర్తి

ఇక్కడే నేను పుట్టి పెరిగేను. అయితే నేను చాలాకాలంగా ఢిల్లీలో ఉండిపోవడంవల్ల ఇక్కడి ఆస్తిపాస్తులు తగువుల్లోనూ, చిక్కుల్లోనూ పడిపోయాయి. నా ఆస్తిపాస్తుల వ్యవహారాన్ని మా దగ్గరి బంధువొకాయన చూసిపెడుతూ ఉండేవాడు. జరూరుగా ఓసారి రావలసిందని అతని దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. సరే. వ్యవహారాలు ఒకసారి పరిచూసుకున్నట్టూ అవుతుంది, నా డాబూ, దర్జా, ఫారిన్ వెళ్ళి వచ్చాననే గొప్పలు అన్నీ ప్రదర్శించినట్టూ ఉంటుందని బయలుదేరి ఈ ఊరొచ్చాను. వచ్చిన వారంరోజుల తర్వాత డబ్బు అవసరంపడి డ్రాఫ్ట్ మార్చుకోడానికి ఇదే బ్యాంక్‌కి వచ్చాను. ఊరంతటికీ ఇదొక్కటే బ్యాంక్ కావడంవల్ల, జనంతో కిటకిటలాడుతోంది. ఫుల్ సూటులో నిగనిగలాడుతూ వచ్చిన నన్నుచూసి చాలామంది తమ దృష్టిని నావైపు మళ్ళించడం నాకు ఎంతో తృప్తినిచ్చింది. అయితే డ్రాఫ్ట్‌ని కౌంటర్‌లో ఇచ్చేసి, టోకెన్ తీసుకున్న తర్వాత, అందరిలాగానే నేనుకూడా వెయిట్ చెయ్యవలసిరావడం నాకుబహుకష్టంఅనిపించింది. మిగిలిన వాళ్ళతోపాటుగా, బెంచీలమీద కూర్చోడానికి నా అహం అడ్డొచ్చింది. అంచేత అందరికీ దూరంగా, ఖాళీగా ఉన్న ఓ కౌంటర్‌కి కాస్త విలాసంగా ఆనుకొని నిలబడ్డాను. నా ఇంపార్టెన్స్‌కి ఈ పల్లెటూరి బ్యాంక్‌లో తగిన గుర్తింపు లేకపోవడంతో దెబ్బతిన్న నా 'ఇగో' బ్యాంక్‌లో చేరిన జనాన్ని గొర్రెలమంద కింద, వాళ్ళ మాటల్ని సంతగోలకింద జమకట్టి, ఊరటపొందుతోంది.

అదిగో అలాంటి సమయంలో ఓ ముసలాయన నా దగ్గరికి వస్తుండడం కనపడింది. చేతిలో కర్ర, ఎంతో కష్టంమీద పడుతున్న అడుగులు, మాసిన పంచె, దళసరి కళ్ళద్దాలు— వీటితో పూర్తికాలేదు అతని దీనత్వం, అతను మరికాస్త దగ్గరకు రాగానే, అప్రయత్నంగా నా కాళ్ళు అక్కడినుంచి పారిపోవడానికి తయారయ్యాయి. అతగాడు ఏ జబ్బుతో బాధపడుతున్నాడో అర్థంకాగానే మనస్సు జుగుప్సతో నిండిపోయింది. మనసులో ఈ కల్లోలం రేగుతూనే ఉంది. ఈ లోపుగా ముసలాడు దగ్గరకొచ్చేశాడు. వచ్చేసి "ఒక్కసారి మీ పెన్ ఇవ్వగలరా, ఫారం ఫిలప్ చేసి ఇస్తాను" అన్నాడు. శరీరం రోగ భూయిష్టమైనా, అతగాడి మాటల్లో మాత్రం మంచి సంస్కారం ధ్వనించింది. కాని అతగాడికి, అతగాడికి నా పెన్ ఎలా ఇవ్వగలను. నా వెండి పార్కర్ పెన్ ఆ జబ్బుచేతుల్లో ఉంచడమా? నో, కుదర్దుగాక కుదర్దు "సారీ పెన్ రాయటంలేదు" అని అప్రయత్నంగా అబద్ధం చెప్పేసి ఆ ముసలాడి దగ్గర్నుండి గబగబా నడిచి వెళ్ళిపోయాను. నేను వెనక్కి తిరగ్గానే 'హూ' అని ముసలాడు విడిచిన నిట్టూర్పులోని నిస్పృహ నావీపుని బలంగా తాకింది. అంతకుమించి అలాంటి జబ్బువాడి ముందు నా సంస్కార రాహిత్యం బహిర్గతం కావడంతో మనస్సు పిచ్చెక్కిన కోతిలా చిందులు వేసింది.

ఇన్నాళ్ళ తర్వాత అటువంటి పరిస్థితే నాకెదురయింది ఇవాళ. సుమారు రెండేళ్ళక్రితం ఢిల్లీలో జరిగిన ఒక పెద్ద రోడ్డు ప్రమాదంలో నా కాలు పోయి అవిటివాణ్ణయ్యాను. నా ఎగ్జిక్యూటివ్ జాబ్ పోయింది. నా శారీరక పరిస్థితులకు సరిపడే చిన్న ఉద్యోగాన్ని కంపెనీ వాళ్ళు ఆఫర్ చేస్తే అహంకారంతో తిప్పికొట్టేను. ఆస్పత్రులంట తిరగడంతో ఉన్న కాస్త డబ్బు కరిగిపోయింది. చివరకు నా కర్ర కాలు, ఖాళీ పర్సులతో మరి ఢిల్లీలో బతకలేక ఈ చిన్న ఊరికే చేరుకున్నాను. అంతకు ముందునుండే తగువుల్లో ఉన్న నా పొలాలు, నా అంగవైకల్యం కారణంగా ఆక్రమణదారుల చేతుల్లోకి పోయాయి. నిస్పృహాయుణ్ణయి, పేదరికంలో బతకలేనేమోననే భయంతో అనుక్షణం కంపించి పోతున్నాను. పేదరికం భయం నా బట్టల్లో, నా ఆకారంలోనూ స్పష్టంగా కనిపించడం సహజమే. అయినప్పటికీ ఎవ్వెవరేనా బిచ్చగాడిలా ట్రీట్ చేస్తే! నో! నేను సహించలేను బహుశా! కానీ అదే జరిగిందివ్వాళ బ్యాంక్‌లో.

బ్యాంక్‌లో ఎప్పుడో పూర్వాశ్రమంలో దాచుకున్న కొద్దిపాటి నిలువలోంచి కొంచెం డబ్బు అవసరాలకి తెచ్చుకోవాలని బయల్దేరాను. నా స్మార్ట్ హేబిట్స్ ఏ గంగలో కలిసిపోయాయో మరి, బ్యాంక్‌కి బయలుదేరే ముందు కనీసం పెన్ను తెచ్చుకోవాలన్న విషయంకూడా మర్చిపోయాను.

నేనడిగితే ఎందుకు ఒబ్లైజ్ చెయ్యదూ ఈ ప్రపంచం అనే అహం ఇంకా నాలో ఏ మూలనో మిగిలిపోయినట్టుంది "మీ పెన్నొక్కసారి ఇవ్వండి" అనడిగాను పక్కన నిల్చున్న నవ నాగరిక యువకుణ్ణి. ఒక లిప్తకాలం అనుకుంటూ నన్ను సర్వే చేశాడు. విరిగిన కాలు, ఊతకర్ర, మాసిన బట్టలు, కృశించిన శరీరం. బిచ్చగాడిలా కనిపించి ఉంటాను 'నో' అని నిర్దయగా అనేసి, తల మరో పక్కకి తిప్పేసుకున్నాడు.

"మిస్టర్! నేనెవర్ననుకుంటున్నావ్? నేను యూరప్ వెళ్ళివచ్చాను తెల్సా? నేను ఢిల్లీలో ఉద్యోగం చేశాను తెల్సా?" అని బ్లర్ట్ అవాలనిపించింది.

కానీ ఎందుకనో నేనవాలని ఉద్దేశించిన మాటలు గొంతులోంచి బయటికి రాలేదు. అతని సంస్కార రాహిత్యానికి గండికొట్టాలని అనుకోగానే, పాత సంఘటన గుర్తుకు వచ్చి, కనిపించని కొరడాతో నన్ను అధిలించింది. యూరప్‌లో అలవర్చుకున్న సంస్కారం ఆవేళ ఏమయిందని మనస్సు నిలదీసింది. "దారుణమైన జబ్బుతో అసలే గాయపడిన మనిషిని మరింత గాయపర్చకుండా ఉండడానికైనా కనీసం సౌమ్యంగా 'నో' అనగలిగేవా? అలాటప్పుడు ఇవాళ జరిగిన తిరస్కారానికి బాధపడడానికి, అభ్యంతరం చెప్పడానికి నిజంగా నీకు హక్కుందా?" అని మనసు ప్రశ్నించింది.

సమాధానం దొరక్కపోవడంతో కళ్ళల్లో నీరు తిరిగినట్లనిపించింది. నా కన్నీళ్ళని ఎవరూ చూడకూడదని, పక్కకి తిరిగి గోడమీదికి దృష్టి మళ్ళించాను. ఎదురుగా విశ్వకవి రవీంద్రుని ఫోటో— దాని క్రిందుగా అతని 'గీతాంజలి' నుండి తీసిన వాక్యాలు.

**"Strike strike at the root of penury in my heart.."** అని నా అల్పత్వం నాకే తెలిసొచ్చినట్టనిపించింది. ఆ వాక్యాలు చదవగానే ఉస్సురని నిట్టూరుస్తూ దగ్గరగా ఉన్న కుర్చీలో కూలబడ్డాను.